



ధర్నా చేస్తున్న అమరావతి జెఎసి సంఘ నాయకులు

రేపట్నుంచి ప్రచార భేరి

సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు గోవిందరావు, శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే ప్రచారభేరిని జయప్రదం చేయాలని జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. నగరంలోని క్రాంతిభవన్‌లో ప్రచార భేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని, వనరులను దోచుకుంటున్న మోడీ, షా, అదానీ త్రయం మోదానీ దోపిడీపై, కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు సిపిఎం, సిపిఐ ఉమ్మడిగా రాజకీయ ప్రచార భేరి చేపడుతోందని చెప్పారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో సైకిల్‌యాత్రలు, పాదయాత్రలు, సభలు, సమావేశాలు, ఇంటింటా కరపత్రాల ద్వారా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు కేంద్రం మోపుతున్న భారాలను వివరిస్తామన్నారు.

ప్రస్తుతం పార్లమెంటులో ప్రజాస్వామ్యం గొంతు నొక్కి భావప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తున్నారని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి చిన్న కేసులో రెండేళ్ల శిక్ష పడితే దాన్ని అడ్డుపెట్టుకొని అతని సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేసి ప్రతిపక్షాలపై బెదిరింపు చర్యలకు దిగారని గుర్తుచేశారు. మోదానీ ఆక్రమాలపై పార్లమెంటులో చర్చ జరుగుతున్నా, రూ.లక్ష కోట్ల కుంభకోణంపై ప్రధాని మోడీ నోరెత్తడం లేదని విమర్శించారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు అదానీ అవినీతిపై చర్చకు పట్టుబడుతున్నా, ప్రధాని ఇప్పటివరకు నోరెత్తకపోవడం అంటే దేశానికి ఏ సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. అవినీతిలో భాగం లేదని గానీ, తమకు సంబంధం లేదని చెప్పలేకపోతున్నారని తెలిపారు. బిజెపి మతోన్మాదంపై వైసిపి, టిడిపి, జనసేన నాయకులు నోరెత్తడం లేదని, మోడీని చూసి భయపడుతున్నారా ప్రశ్నించారు. అవినీతిపై అన్ని ప్రతిపక్షాలు పార్లమెంటులో పోరాడుతుంటే వైసిపి, టిడిపి ఎంపీలు చేతులు కట్టుకుని కూర్చున్నారని, ఇది రాష్ట్రానికి అవమానమన్నారు. దీనిపై ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి సీనియర్ నాయకులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రచార భేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

ఉద్యోగులపై వైఖరి మార్చుకోవాలి

- ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర నాయకులు కె.అంజనీ కుమార్
- నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని మార్చుకోవాలని ఎపి ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర నాయకులు కె.అంజనీ కుమార్ అన్నారు. జెఎసి అమరావతి మలి దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా నగరంలోని రెవెన్యూ అతిథిగృహం ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. నాలుగేళ్లుగా ప్రతి ఉద్యోగి ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి శ్రమిస్తున్నా వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం సానుకూల వైఖరితో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అమరావతి జెఎసి జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు మాట్లాడుతూ తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. న్యాయసమ్మతంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన జీతభత్యాలు, ఆరోగ్య భద్రత ఇతర చిన్నపాటి ఆర్థిక ప్రయోజనాలతో కూడిన కోర్కెలు కోరినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఉద్యోగుల డిఎ, పిఆర్‌సి ఎరియర్స్‌ను చెల్లించాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలను పెంచాలని, ఎంప్లాయీస్ హెల్త్‌కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కరోనా ముందు కరోనా సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాకాలను వెంటనే చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల తొమ్మిది నెలల కాల పరిమితికి సంబంధించిన డిఫరెన్స్ అమౌంట్‌ని వెంటనే చెలించాలని చెప్పారు. విఆర్‌ఎల డిఎలతో పాటు గ్రేడ్-2 విఆర్‌ఒల పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జెఎసి అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ చక్రవర్తి, సింహాచలం, మురళీధర్ నాయక్, డి.పద్మావతి, కార్యదర్శి బి.వి.వి.ఎన్ రాజు, జి.కె శ్రీనివాసరావు, గణేష్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు డి.సోనికిరణ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సవర జగన్నాయకులు

అసెంబ్లీ తీర్మానం రద్దు చేయాలి

- 19న సిఎంను అడ్డుకుంటాం
- 2024 ఎన్నికలను బహిష్కరిస్తాం
- ఆదివాసీ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్నాయకులు

ప్రజాశక్తి - పలాస

గిరిజనులకు వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆదివాసీ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు, జెఎసి జిల్లా సమన్వయకర్త సవర జగన్ విమర్శించారు. కాశీబుగ్గలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మాణం, జిఒ నంబరు 52ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈనెల 19వ తేదీన జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని అడ్డుకుంటామని హెచ్చరించారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే 2024 అసెంబ్లీ ఎన్నికలను గిరిజనులంతా ఏకమై బహిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో గిరిజనులను చైతన్యపరిచి ఉధృత పోరాటం చేస్తామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చేందుకు గిరిజనులు మద్దతు పలికారని, ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీని గెలిపించినందుకు వారికే అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు.

1965లో లోకుర్ కమిటీ నివేదికను పరిశీలించకుండా అసెంబ్లీ తీర్మానం ఎలా చేశారని ప్రశ్నించారు. గిరిజనేతరులను ఎస్‌టిల్లో చేర్చిస్తే గిరిజనులకు తీవ్ర నష్టం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల గిరిజనుల ఆందోళన సమయంలో మంత్రి సీదిరి అప్పలరాజు గిరిజనులకు న్యాయం చేస్తామని హామీనిచ్చి, కేబినెట్ తీర్మానంలో ఎలా సంతకం చేశారని ప్రశ్నించారు. దీనిపై గిరిజనులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయం మార్చుకోకపోతే గద్దె దించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా చైతన్య వేదిక అధ్యక్షుడు సవర చొక్కారావు, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.ఈశ్వరరావు, సవర చంద్రశేఖర్, సవర మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

2632 మందికి ఇబిసి నేస్తం

రూ.3,984 కోట్లు జమ : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఇబిసి నేస్తం కింద 2,632 మందికి రూ.3.94 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. మార్కాపురంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం బటన్ నొక్కి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేశారు. వర్చువల్ విధానంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గంలో 176 మందికి రూ.26.40 లక్షలు, ఎచ్చెర్లలో 374 మందికి రూ.56.10 లక్షలు, ఇచ్ఛాపురంలో 620 మందికి రూ.93.00 లక్షలు, నరసన్నపేటలో 138 మందికి రూ.20.70 లక్షలు జమ చేస్తున్నట్లు వివరించారు. పలాస నియోజకవర్గంలో 410 మందికి రూ.61.50 లక్షలు, పాతపట్నంలో 335 మందికి రూ 50.30 లక్షలు, శ్రీకాకుళంలో 429 మందికి రూ.64.40 లక్షలు, టెక్కలిలో 150 మందికి రూ.22.50 లక్షలు జమ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఇడి ఆర్.గడ్డెమ్మ, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పి.వాసుదేవరావు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధి గుంట జ్యోతి, నాగలక్ష్మి, వైసిపి నాయకులు చౌదరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని ముద్దాడపేట నుంచి తమ్మయ్యపేట - కనుగులవలస మీదుగా సిఎస్‌పి రోడ్డు వరకు రూ.3.63 కోట్లతో నిర్మించిన రహదారిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. కుల, మత, ప్రాంతీయ విబేధాలకు తావు లేకుండా అవినీతి రహిత పాలనను అందిస్తూ సంక్షేమ పథకాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల తీరు తెన్నులను ఇతర రాష్ట్రాలు ఆసక్తిగా చూస్తున్నాయన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ రకరకాల వాగ్దానాలు, వేషాలతో పలు పార్టీల నాయకులు ప్రజల దగ్గరకు వస్తుంటారని, వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి మాయలో పడొద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ టొంపల ఉమ, గురుగుబెల్లి ప్రభాకరరావు, పేడాడ వెంకటరమణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రహదారిని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

సిఎం పర్యటనా ఏర్పాట్లు పరిశీలన

నౌపడ : భావనపాడు పోర్టు శంకుస్థాపనకు మూలపేట, విష్ణుచక్రం, నౌపడలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 19వ తేదీన పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. హెలీప్యాడ్, పైలాన్ ఆవిష్కరణ ప్రాంతం, నౌపడలో బహిరంగ సభ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వేలాదిమంది ప్రజలు సభకు వస్తే భద్రత, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తీసుకునే చర్యలను సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ చలమయ్య, టెక్కలి సిఐ నీలయ్య, ఎస్‌ఐలు లావణ్య, మహమ్మద్ అలీ, మూలపేట సర్పంచ్ బాబురావు, పోర్టు నిర్మాణ సంస్థ విశ్వసముద్ర కన్‌స్ట్రక్షన్స్ అధినేత అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన కెటి రోడ్డు విస్తరణ

పలాస : పలాస-కాశీబుగ్గ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కెటి రోడ్డు విస్తరణ పనులు, సిసి రోడ్డు, పారిశుధ్య నిర్వహణను బుధవారం పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కెటి రోడ్డు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అపారిశుధ్య పరిస్థితులపై తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయివేటు స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే భవనాలను తొలగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ సీతారాం, టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్‌డి నాగరాజు

కచ్చితత్వంతో కేసుల దర్యాప్తు


ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేసుల దర్యాప్తును సూక్ష్మ కోణంలో, నిశితమైన ఆధారాలతో దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. తీవ్రమైన నేరాల దర్యాప్తు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు, సిసి కెమెరాల ఏర్పాటు, పోక్సో, ఎస్‌సి, ఎస్‌టి కేసులు, ఇతర ముఖ్యమైన నేరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాల్లో ఫిర్యాదు అందిన వెంటనే సకాలంలో నేర స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించి సరైన సాక్ష్యాధారాలను సేకరించాలని సూచించారు. కేసుల్లో లభ్యమయ్యే ఆధారాలతో 60 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్‌ను దాఖలు చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసులు, పోక్సో వంటి కేసుల్లో ప్రతి అంశాన్నీ పరిశీలించి, విచారణలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు సంబంధిత ఆధారాల నివేదిక దర్యాప్తుని నిర్ణీత గడువు లోగా పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు.

సాంకేతికతతో త్వరితగతిన సైబర్ కేసులను దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. మహిళా పోలీసుల సమన్వయంతో దిశ యాప్, సైబర్ మోసాలపై గ్రామ, నగర పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలపై అలసత్వం పనికిరాదని, సమాచారం అందిన వెంటనే స్పందించి నేర స్థలాన్ని పరిశీలించాలని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్ అవసరమని, వాహనాలు నిరంతరం తనిఖీ చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు మహిళా పోలీసుల సమన్వయంతో విధి విధానాలు ఏర్పాటు చేసుకుని ముందుకెళ్లాలన్నారు. తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై షీట్ ఓపెన్ చేయాలని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

పాత నేరస్తుల స్థితి, చోరీలకు పాల్పడకుండా బీట్లు, పికెట్లు, లర్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మిస్సింగ్ కేసుల ఛేదన, సిసి కెమెరాల ఏర్పాటు వంటి అంశాల్లో ప్రతిభ కనబరిచిన రెండో పట్టణ సిఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు సత్యనారాయణ, బి.గణేష్, కామేశ్వరరావు, నారాయణస్వామి, మహమ్మద్ అలీ, బి.సత్యనారాయణ, ఎల్.రామకృష్ణ, వై.సింహాచలం, ఎస్‌ఐ అమిద్ మహమ్మద్ అలీకి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, సిహెచ్ ప్రసాదరావు, జి.శ్రీనివాసరావు, డి.ప్రసాదరావు, సిఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

పత్రికల ఈ-ఫైలింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఆర్‌ఎన్‌ఐ పొంది పత్రికలు నిర్వహిస్తున్న ఎడిటర్లు ప్రతి ఏడాది ఈ-ఫైలింగ్ చేయించుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల పాటు ఈ-ఫైలింగ్ చేయని పత్రికల ఆర్‌ఎన్‌ఐ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు అడిషనల్ ప్రెస్ రిజిస్ట్రార్, రిజిస్ట్రేషన్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా కార్యాలయం, సమాచార, ప్రసారాల మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ తెలియజేసిందని పేర్కొన్నారు. జిల్లాలో ఈ-ఫైలింగ్ చేయని పత్రికలు 12 ఉన్నాయన్నారు. సదరు పత్రికల వివరాలు డిఐపిఆర్‌ఒ కార్యాలయం నోటీస్ బోర్డులో ఉంచినట్లు తెలిపారు. ఈ-ఫైలింగ్ చేయని పత్రికలు ఈనెల 15వ తేదీ లోగా ఫైలింగ్ చేసి, సదరు పత్రాలను ఏప్రిల్ 30వ తేదీ లోగా డిఐపిఆర్‌ఒ కార్యాలయానికి సమర్పించాలని తెలిపారు. ఇప్పటికే ఈ-ఫైలింగ్ చేస్తే వాటి ప్రతులను సమర్పించాలని, ఇతర కారణాల వల్ల పత్రికను నిలిపివేస్తే రాతపూర్వకంగా తెలియజేయాలని పేర్కొన్నారు. ఇతర సందేహాలకు డిఐపిఆర్‌ఒ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

జిల్లా జైలు సందర్శన

ప్రజాశక్తి - గార

మండలంలోని అంపోలులో గల జైలులో ఖైదీల స్థితిగతులు, అందుతున్న వసతులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు బుధవారం పరిశీలించారు. రిమాండ్ ఖైదీల వ్యక్తిగత సమస్యలతో పాటు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు న్యాయ సాయం కావాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేయాలని, వారికి ఉచితంగా న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైలర్ ఓబారక్ నాయుడు, జిల్లా జైలు సూపరింటెండెంట్ నబీ ఖాన్, జైలు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నగరంలోని రిమ్స్ ఆస్పత్రి వద్ద గల దిశ ఆస్పత్రిలోని వన్ స్టాప్ సెంటర్‌ను పరిశీలించారు.


జైలును పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

రాజేశ్వరిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిఎస్‌టి శాఖ పరిధిలో ఉద్యోగుల అక్రమ డెప్యుటేషన్లతో పాటు అక్రమాలను ప్రశ్నించినందుకు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, జిఎస్‌టి శాఖ సీనియర్ అసిస్టెంట్ అలికాన రాజేశ్వరిని సస్పెండ్ చేశారని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.నారాయణరావు తెలిపారు. తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేసి, యథాస్థానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. నగరంలోని జెడిపి అతిథిగృహంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఇప్పిలి నారాయణరావుతో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిఎస్‌టి శాఖలో ఇతర జిల్లాల్లో బదిలీపై పనిచేయాల్సిన ఉద్యోగులను అక్రమ విధానంలో జిల్లా కేంద్రానికి డెప్యుటేషన్‌పై నియమించారని, దీనిపై ప్రశ్నించడంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసిన రాజేశ్వరిపై ఆ శాఖ ఉన్నతాధికారులు కక్షసాధింపు ధోరణి అవలంభిస్తున్నారని చెప్పారు. ఎటువంటి మెమోను జారీ చేయకుండా షోకాజ్ నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం తగదన్నారు. తక్షణమే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.తిరుపతిరావు, ఇతర నాయకులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న నారాయణరావు

ప్రయాణికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పలాస

ఆర్టీసీ ప్రయాణికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అందులో భాగంగా ప్రతి ఆర్టీసీ బస్సులో ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచుతున్నామని పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆర్టీసీ డిపో వద్ద ఉషా డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో 122 మంది కండక్టర్లు, 38 మంది డ్రైవర్లకు 160 ప్రథమ చికిత్స కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండక్టర్, టిమ్ డ్రైవర్లు డ్యూటీకి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ప్రథమ చికిత్స కిట్లను తీసుకువెళ్లాలని కోరారు. బస్సుల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఇతర సామగ్రి, అత్యవసర వేళల్లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఉషా డెంటల్ ఆస్పత్రి అధినేత డాక్టర్ పొడుగు కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ సుష్మా, మేనేజర్ తులసిదేవ్, తదితరులు పాల్గొన్నారు.


డ్రైవర్లు, కండక్టర్లకు కిట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

వైసిపితోనే మత్స్యకారుల అభివృద్ధి

మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పోలాకి

ఎన్నడూలేని విధంగా వైసిపి ప్రభుత్వంలోనే మత్స్యకారులకు ఒక గుర్తింపు వచ్చి, అభివృద్ధి చెందారని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం పోలాకిలో దువ్వారపు గురునాథరావు, సింగిడి వాసు ఆధ్వర్యాన నెయ్యల కుల మైదాన మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులకు ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి పదవులను సిఎం జగన్ ఇచ్చారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ మత్స్యకారులకు తగిన గుర్తింపు ఇవ్వలేదని అన్నారు. సమాజం బాగు పడాలంటే విద్యా వ్యవస్థ బాగుపడాలన్న ఉద్దేశంతోనే సిఎం విద్యార్థుల చదువుల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. మత్స్యకారులకు వలలు, బోట్లు ప్రస్తుతం 40శాతం నుంచి 75శాతం వరకు పెంచినట్లు చెప్పారు. మత్స్యకారులు కోరిన మార్కెట్ స్థలం, కమ్యూనిటీ హాలు, మూడేళ్ల లీజులు దశల వారీగా అమలవుతాయని భరోసా ఇచ్చారు. అనంతరం మత్స్యకారుల సంఘం నాయకులు మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ఎం.భైరాగినాయుడు, మజ్జి రవణమ్మ, అశోక్‌కుమార్, త్రినాథరావు, డి.గురునాథ్, సింహాద్రి, గోపి, సోమశేఖర్, ఎన్.భూషణ్‌రావు, ఎం.త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

సంక్షేమ పథకాల పేరుతో శఠగోపం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస, సరుబుజ్జిలి

సంక్షేమ పథకాల పేరిట ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల నెత్తిన శతగోపం పెడుతున్నాడని టిడిపి ఇల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. బుధవారం సరుబుజ్జిలి మండలం మతలబుపేటలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైసిపి పాలనలో ప్రజలకు జరుగుతున్న నష్టంపై ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరల స్థిరీకరణ కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ మాటనే మరిచి, మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల పేరుతో ఒక చేత్తో డబ్బులు ఇచ్చి మరో చేత్తో పన్నుల భారాలను వేస్తూ లాక్కుంటున్నారని విమర్శించారు. నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని కట్టడి చేయాల్సిన ముఖ్యమంత్రి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని చోద్యం చూస్తున్నారని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఏడు సార్లు విద్యుత్ బిల్లులను పెంచి ప్రజల నుండి అధిక మొత్తంలో సొమ్మును దోచుకుంటున్నారని చెప్పారు. రైతుల నుండి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అంబళ్ల రాంబాబు, నందివాడ గోవిందరావు, నూక కోటేశ్వరరావు, నూక వెంకటలక్ష్మి, లావేటి పూర్ణరావు, రామారావు, తదితరుల పాల్గొన్నారు.


'ఇదేం ఖర్మ మన రాష్టానికి'లో పాల్గొన్న రవికుమార్

పట్టాలు ఇచ్చారు.. స్థలం ఇవ్వడం మరిచారు

ప్రజాశక్తి - బూర్జ

గతంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం 18 మందికి పట్టాలు పంపిణీ చేశారని, నేటికీ స్థలం గుర్తించలేదని స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి పాలవలస ప్రజలు తీసుకొచ్చారు. పాలవలసలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో స్పీకర్ పాల్గొన్నారు. వెంటనే స్పీకర్ స్పందించి పట్టాలి ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం మంజూరు చేస్తామని, ఎవరూ అధైర్యపడొద్దని అన్నారు. రోడ్లు, కాలువలు పూర్తిగా శిథిలావస్థతకు చేరుకున్నాయని, వర్షం పడితే మురుగునీరు రోడ్డుపైకి వస్తోందని తెలిపారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీప, జెడ్‌పిటిసి బి.రామారావు, డిసిఎంఎస్ మెంబరు బలరాంనాయుడు, గోవిందరావు, మామిడివలస ఎంపిటిసి గుమ్మడి రాంబాబు, వైస్ ఎంపిపి గుడుమూరి సూర్యారావు, తహశీల్దార్ రమణారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, ఎఒ రాజేశ్వరరావు, ఎపిఒ రాజ్‌కుమార్, హౌసింగ్ ఎఇ రమణమూర్తి, పావని, తదితరులు పాల్గొన్నారు.


స్పీకర్‌కు సమస్యను వివరిస్తున్న మహిళలు

వైసిపితోనే సంక్షేమ పాలన

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - జి.సిగడాం

వైసిపితోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మెట్టవలస పంచాయతీలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.21 లక్షలతో నిర్మించిన ఆర్‌బికె, రూ.17.50 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలు సిఎం జగన్‌కే సాధ్యమని అన్నారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలో కల్పించిన మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. వారికి పలు ప్రశ్నలు వేసి,సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.సత్యవతి, వెంకటమరణ, బి.వెంకటరమణ, ఎ.జగన్నాథం, డోల వెంకటరమణ, వైస్ ఎంపిపి వెంకటరావు, ఎం.వెంకటసాయి, ప్రకాష్, సన్యాసిరావు, రామకృష్ణ, ఎంపిడిఒ శ్రీనివాసరావు డిఇ సీతంనాయుడు, హౌసింగ్ ఎఇ రమేష్, తదితరులు పాల్గొన్నారు.


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అప్రమత్తంగా ఉండాలి

కవిటి: సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని డివిజనల్ డిఎల్‌డిఒ, మండల ప్రత్యేక అధికారి అలివేలు మంగమ్మ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ప్రత్యేక అధికారులతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది నిబద్ధతకు మారుపేరుగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలందించాలని, సకాలంలో కార్యాలయానికి చేరుకోవడమే కాకుండా ప్రజలకు మార్గదర్శిగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో ప్రజలకు జవాబుదారిగా ఉండాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో ప్రగతిని ప్రతి నెలా మొదటి బుధవారం తెలియజేయాలని సూచించారు. మండలాల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని జగతి, బెజ్జిపుట్టుగ సచివాలయాల సందర్శించి రికార్డులు పరిశీలించారు. సమావేశంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, డిటిటి రామచంద్రరావు, ఇఒపిఆర్‌డి శివాజీ పాని, ఉద్యానవనశాఖ అధికారి పోలాకి మాధవి, పశువైద్యురాలు శిరీష, ఎపిఎం గోవిందరావు, ఎఇ సాయికిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అలివేలుమంగమ్మ

నవరత్నాల ఏరియా కో-ఆర్డినేటర్‌గా రవికుమార్

ఆమదాలవలస : ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాలకు నవరత్నాల ఏరియా కో-ఆర్డినేటర్‌గా పి.రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన డిఆర్‌డిఎలో డిపిఎం ఫైనాన్స్‌గా విధులు నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య సిబ్బంది సమీక్ష సమావేశ అధ్యక్షు లు తమ్మినేని ధనలక్ష్మి పుష్పగుచ్ఛంతో స్వాగతించి ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఎపిఎం పైడి కూర్మారావు, అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, చంద్రావు, ఉమా, జగదీష్ ఎఫ్‌పిఒ సిసి రామప్పడు, తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన రవికుమార్

సంక్షిప్త వార్తలు

ఉపాధి పనులు పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని దీనబంధుపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ పి.చంద్రకుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్న కారణంగా తగిన ఆరోగ్య జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెతో పాటు ఇసి ఆదినారాయణ, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీలు వితరణ

ప్రజాశక్తి -నౌపడ

సంతబొమ్మాళి మండలం యామలపేట గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు లోపింటి రామిరెడ్డి గ్రామంలో నాలుగు సిమెంట్ బెంచీలను బుధవారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వీటిని అమర్చారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో గ్రామస్తుల కూర్చుని సేద తీరేందుకు ఉపయోగపడతాయని తెలియజేశారు. కార్యక్రమంలో తిప్పన రాజు, పలువురు యువకులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి సాయం

వజ్రపుకొత్తూరు : మండలంలోని బెండి గ్రామానికి చెందిన కేన్సర్ రోగి ఎ.మహాలక్ష్మి కేన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి సభ్యులు బుధవారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇంటి పరిస్థితి, ఆమె ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. భర్తకు టిబి, కుమారునికి వినికిడి లోపం ఉన్నాయి. కుటుంబ పరిస్థితిని చూసి చలించిపోయిన సభ్యులు రూ.15వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో యువతరం అధ్యక్షులు చింత మురళి, కార్యదర్శి గొరకల అశోక్, సభ్యులు జ్యోతి, అఖిల్, రాకేష్, వెంకటరమణ, దేవదాసు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనపై ఉద్యమిద్దాం

టెక్కలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత, ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో ఉద్యమానికి సిద్ధం కావాలని కెవిఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు అన్నారు. ఆదిపత్య శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాంలో భాగంగా బుధవారం చిననారాయణపురంలో ర్యాలీ నిర్వహించారు. దళితుల సంక్షేమానికి నిధులు వెచ్చించి, వారికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తలసముద్రం సూర్యం, గవరయ్య, డోల భూషణరావు, దువ్వాడ విజయరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిటిసి కుటుంబానికి 'కణితి' పరామర్శ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు పంచాయతీ కొప్పలపేట గ్రామానికి చెందిన టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు తల్లి, టెక్కలి ఎంపిటిసి-2 పార్వతి అత్త కూన మల్లమ్మ (90) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. మల్లమ్మ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో అట్టాడ శ్రీధర్, ఇలపండా రమేష్, కణితి మల్లయ్య, కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


సుదర్శనరావును పరామర్శిస్తున్న కిరణ్

అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మండలంలోని కన్నేవలస పంచాయతీ చుట్టుగుండం గ్రామానికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపిపి ఆర్.ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు అన్నారు. బుధవారం చుట్టుగుండం గ్రామంలో ఎంపిటిసి, మండల విప్ బొడ్డు అప్పన్న ఆధ్వర్యాన నూతన డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఈ పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులు నిర్వహించలేదని, ఈ గ్రామానికి సరైన రహదారులు, కాలువలు లేక వర్షాకాలంలో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైసిపి నాయకులు పేడాడ వెంకటరావు, సింగుపురం వినోద్, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నువ్వే మా నమ్మకం జగన్ నిర్వహించారు. వాలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లారు.


కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉమామల్లేశ్వరరావు, వెంకటరావు

48 గంటల సాహిత్య, కళా ప్రదర్శన

అమ్మాజికి నాలుగు ప్రపంచ రికార్డుల్లో స్థానం

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని కోష్ట సచివాలయ మహిళా పోలీసు అమ్మాజి బమ్మిడి 48 గంటల పాటు నిర్విరామంగా సాహిత్య, కళా ప్రదర్శనకు నాలుగు ప్రపంచ రికార్డుల్లో స్థానం దక్కింది. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ, శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా గుత్తాహరి సర్వోత్తమనాయుడు నేతృత్వంలో తిరుపతిలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహోత్సవాలు నిర్వహించారు. మహతి ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 8గంటలకు మొదలైన కార్యక్రమాలు మంగళవారం ఉదయం 8 గంటలకు పూర్తయ్యాయన్నారు. 2860 మంది వివిధ రంగాలకు చెందిన కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. 36 మంది రచయితలు తమ పుస్తకాలను ఆవిష్కరించారు. మీడియా ప్రతినిధిగా హాజరైన అమ్మాజి 48గంటల పాటు సాహిత్య, కళా ప్రదర్శన చేశారు. గతంలో ఈమె అంతర్వేదిలో 30 గంటల 30 నిమిషాల 30 సెకెన్ల పాటు అంతర్జాతీయ స్థాయిలో కవి సమ్మేళనం , పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో, మంచిర్యాలలో 24గంటల 24 నిమిషాల 24 సెకెన్ల పాటు కళా ప్రదర్శనల్లో పాల్గొని పలు రికార్డుల్లో స్థానం దక్కించుకున్నారు. వాటిని బ్రేక్ చేస్తూ 48గంటల కళా ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనకు అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్, టిఎస్ఎ(తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ) బుక్ ఆఫ్ రికార్డ్, కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆమె పేరు నమోదైంది. ఈ సందర్భంగా ఆమెను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో కత్తిమండ ప్రతాప్, కింగ్ ఇంద్ర, జులూరు గౌరీ శంకర్‌శాస్త్రి, కొల్లి రమావతి, తదితరులు పాల్గొన్నారు.


అమ్మాజిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మర్రిపాడు-సి విఆర్‌ఒ సస్పెన్షన్

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు-సి విఆర్‌ఒగా పనిచేస్తున్న యజ్జల రాజును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు తహశీల్దార్ పి.సరోజిని బుధవారం తెలిపారు. గతంలో దీనబంధుపురం గ్రామానికి చెందిన ఓ గిరిజన రైతు నుండి భూమి మ్యుటేషన్ కోసం రూ.5వేలు లంచం తీసుకున్నట్లు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో ఆయనపై చేపట్టిన విచారణలో వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు.

దొంగనోట్ల కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - టెక్కలి

స్థానిక యాక్సిస్ బ్యాంకులోని డిపాజిట్ మిషన్‌లో రూ.44వేలు దొంగనోట్లు గుర్తించిన విషయం తెలిసిందే. బ్యాంకు మేనేజరు సుబ్రహ్మణ్యం చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తుచేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కోదండరామ వీధికి చెందిన సవర ప్రమోద్, పట్నాన అమృత్ సాగర్‌లను బుధవారం అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ప్రమోద్ పాలకొండ రవాణా శాఖలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నట్లు చెప్పారు. వారి నుంచి మరో రూ.35,500 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పలాసకు చెందిన ఓ వ్యక్తి ద్వారా వీరికి నకిలీ నోట్లు వచ్చినట్లు గుర్తించామని అన్నారు.

బోరువెల్ లారీ బోల్తా

ప్రజాశక్తి - పలాస

కోసంగిపురం జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోరువెల్ లారీ బోల్తా పడింది. డ్రైవరు, క్లీనరుకు గాయాలయ్యాయి. కాశీబుగ్గ నుంచి కోసంగిపురం జాతీయ రహదారివైపు బోర్‌వెల్ వెళ్తోంది. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి, లారీ బోల్తా పడింది. ప్రమాదంలో ఒడిషా రాష్ట్రం జామగూడ గ్రామానికి చెందిన ఐతా, రాజానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆటోలో ఆస్పత్రికి వెళ్తున్న క్షతగాత్రులు

ఏమిటీ జ్వరాలు.. ఎందుకింత తీవ్రత?

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని కపాసుకుద్ది గ్రామంలోనే జ్వరాల తీవ్రత ఎందుకు అధికంగా ఉంటోంది? వైద్య సేవలు సక్రమంగా అందడం లేదా.. లేదా స్థానికంగా సమస్యలు ఉన్నాయా? వెంటనే గ్రామంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు ముమ్మరం చేసి, పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని రాజపురం వైద్య సిబ్బందిని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ ఆదేశించారు. గ్రామంలో జ్వరాలు అధికంగా ఉన్నాయని, పరిస్థితి చేయి దాటిపోతుందని సర్పంచ్ కాయ దమయంతి సమాచారం మేరకు బుధవారం సాయంత్రం రాజపురం పిహెచ్‌సి వైద్య సిబ్బందితో ఎంపిపి ప్రతినిధి సమావేశమయ్యారు. కపాసుకుద్ది గ్రామంలోనే ఎందుకంత తీవ్రత ఉంటోంది. కారణం ఏమిటిని డాక్టర్ శశిధర్‌ను ప్రశ్నించారు. దీనిపై శశిధర్ గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్నామని, ఆశాలు, ఎఎన్‌ఎంలు నిరంతరం ప్రతి ఇంటినీ సందర్శించి, వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఎంపిపి ప్రతినిధి మాట్లాడుతూ మరి జ్వరాల తీవ్రతకు కారణమేంటిని? దీనిపై పూర్తిస్థాయిలో దష్టి సారించి గ్రామంలో పరిస్థితి అదుపులోకి తీసుకురావాలని సూచించారు.. అనంతరం డాక్టర్ శశిధర్ ఆధ్వర్యంలో రాజపురం వైద్య సిబ్బంది, ఎంపిడిఒ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి కపాసుకుద్ది గ్రామానికి చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులకు చెప్పారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పలాస: కాశీబుగ్గ తాళ్లభద్ర సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాళ్లభద్ర గ్రామానికి చెందిన దుర్యోధన (43) అక్కడికక్కడే మృతి చెందారు. దుర్యోధన ద్విచక్ర వాహనంపై తాళ్లభద్ర నుంచి కాశీబుగ్గ వైపు వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో దుర్యోధన అక్కడికక్కడే మృతి చెందారు. ఈయన దుబాయ్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. మృతునికి భార్య జయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని కాశీబుగ్గ ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

మిషన్ వాత్సల్య అమల్లో విఫలం

జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

వెనుకబడిన కుటుంబాలకు జీవనోపాధి కలిగించే, ఇంటి పెద్దను కోల్పోయిన పిల్లల విద్య కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్యను అమలు చేయడంలో అధికార పార్టీ ఘోరంగా విఫలమైందని జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు విమర్శించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లడంలో అధికార పార్టీ నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. జగనన్న నమ్మకం పేరిట గోడపై స్టిక్కర్లు అంటించే శ్రద్ధ మిషన్ వాత్సల్యపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి ఉంటే ఎంతో బాగుంటుందని చెప్పారు. కవిటి మండలంలోనే జెడ్‌పి చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉన్నా పది మందిని కూడా నమోదు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రొక్కల భాస్కరరావు, గౌడ్, రుక్మాంధర్‌రెడ్డి, సోమేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దాసరి రాజు


మాట్లాడుతున్న చంద్రపతిరావు

బిసి కులగణనకు కమిటీ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో బిసి కులగణనపై అధ్యయనం చేసేందుకు కమిటీని నియమించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆదేశించడం హర్షనీయమని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రపతిరావు అన్నారు. నగరంలోని బిసి సంక్షేమ సంఘ భవనంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా బిసి సంఘాల ఆధ్వర్యాన బిసి కులాల వారీగా గణన చేపట్టాలని పోరాటాలు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణలో బిసి కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సానుకూలంగా వ్యవహరించడంతో పాటు పార్లమెంటులో బిల్లు పెట్టేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు డి.పి దేవ్, మెండ రాంబాబు, గంజి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

బురిడికంచరాంలో గడ్డివాములు దగ్ధం

పొందూరు: మండలంలోని బురిడికంచరాంలో బుధవారం సంభవించిన అగ్నిప్రమాదంలో సారిక ఆదినారాయణకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటనా స్థలంకు చేరుకుని మంటలను అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిర్లక్షం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లుగా గుర్తించారు. ప్రమాదంలో సుమారు రూ.10వేలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది గుర్తించారు.


మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అది జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని సిరియాకండి, పెద్ద పద్మాపురం గ్రామాల్లో జగనన్న మా భవిష్యత్‌ను బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, పల్లి యోగి, ఎంపిటిసి ప్రతినిధులు రుషి, జయముని, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎం.వి పద్మావతి

టెక్కలి: ప్రజా సంక్షేమానికి సిఎం పెద్దపీట వేస్తున్నారని ఎంపిపి ఎ.సరోజనమ్మ అన్నారు. మండలంలోని గూడెం పంచాయతీలోని గూడెం, పిట్టలసరియా, చిన్న కేదారి, డమరలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, వాటిపై అవగాహన కల్పించి, ప్రజలకు అందుతున్నాయో, లేదో అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి, ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రాహుల్, ఆట్ల రవి, సిగిలిపల్లి వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తోనే సంక్షేమరాజ్యం,అభివద్ధి సాధ్యమని చీపుర్లపాడు పంచాయతీ సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్నలు అన్నారు.
మండలంలోని చీపుర్లపాడు, దుర్గంపేట, వరహాలమ్మపేట, హరిశ్చంద్రపురం, కోటబొమ్మాళి, యలమంచిలిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.సర్పంచ్ ఎన్.చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపిటిసి బి.అప్పన్న ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గురుబెల్లి కేశవరావు, కాళ్ల సంజీవరావు, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని అడంగివారి వీధి, గోనెలవారి వీధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి బాషా, సురేష్, పావని తదితరులు పాల్గొన్నారు.

టిడిపివి దిగజారుడు రాజకీయాలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును ఓర్వలేని టిడిపి నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైసిపి మండల అధ్యక్షులు పి.ఆనంద్ విమర్శించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు సమక్షంలో టిడిపిలో వైసిపి నాయకులు చేరినట్లు చెబుతున్నారని, వారంతా టిడిపి వారేనని అన్నారు. గతంలో ఎమ్మెల్యే అశోక్‌తో ఉన్న ఫొటోలను మీడియాకు చూపించారు. ఇచ్ఛాపురం టిడిపికి కంచుకోటగా ఉందని చెబుతున్న టిడిపి నేతలకు సవాల్ విసిరారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు దక్కత నూకయ్యరెడ్డి, పి.రాజశేఖరరెడ్డి, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.


అశోక్‌తో టిడిపి నేతలున్న ఫొటోను చూపిస్తున్న నారాయణమ్మ

వైసిపి నాయకుల పరామర్శ

పొందూరు: మండలంలోని లచ్చయ్యపేటలో ఇటీవల మృతి చెందిన సంపతిరావు అప్పలరాజు కుటుంబసభ్యులను పొందూరు వైసిపి నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాం ఫోన్ చేసి కుటుంబసభ్యులకు పరామర్శించి, ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, నాయకులు పూడి పోలయ్య, పి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


మృతుని కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెళియాపుట్టి: మండలంలో మూడు అంగన్వాడీ హెల్పర్ పోస్టు ఖాళీగా ఉన్నాయని సారవకోట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ హెచ్.కామాక్షి బుధవారం తెలిపారు. చోంపాపురం బిసి, డి.జాడుపల్లి బిసి-ఇ, చాపర-2 కేంద్రానికి బిసి సి, ఖాళీగా ఉన్నాయని, ఈ మూడు పోస్టులకు అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు సారవకోట ఐసిడిఎస్ కార్యాలయానికి దరఖాస్తు అందించాలని తెలిపారు.

వాలంటీరు పోస్టులకు

పొందూరు: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వాలంటీరు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎఒ వి.మురళి బుధవారం తెలిపారు. మండలంలోని కింతలి-1(బిసి-పురుషులు), బురిడికంచరాం-1(బిసి మహిళ), పొందూరు సచివాలయం 2లో-1 (బిసి మహిళ), గోరింట-1(బిసి పురుషులు), కోటిపల్లి-1(బిసి జనరల్) పోస్టులకు అర్హత కలిగి, ఆసక్తి కలిగిన వారు 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా ఎంపిడిఒ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

సచివాలయ సిబ్బందితో సమీక్ష

ఇచ్ఛాపురం: మండలంలోని కొఠారి, తులసీగాం, ధర్మపురం సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ రామారావు బుధవారం సమీక్షా సమావేశాలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది పని తీరు, సంక్షేమ పథకాలు అమలు తీరుపై సమీక్షలు చేసి, పలు సూచనలు చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, పని తీరు పరిశీలించారు. వాలంటీర్లు పనితీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ రికార్డులు పరిశీలించారు.


సమీక్షిస్తున్న ఎంపిడిఒ రామారావు

'ఫ్యామిలీ డాక్టర్'తో పేదలకు మేలు


బిపి పరీక్షించుకుంటున్న నాగభూషణం

ప్రజాశక్తి - కవిటి

ఫ్యామిలీ డాక్టర్‌తో పేద ప్రజలకు మేలు జరుగుతుందని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ కార్యదర్శి బర్ల నాగభూషణం అన్నారు. కొత్తూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జ్వరాల తీవ్రత ఉందని, ఇటువంటి సమయాల్లో ఫ్యామిలీ డాక్టర్ ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన బిపి పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వాలంటీర్లు పాల్గొన్నారు.

పొందూరు: 'ఫ్యామిలీ డాక్టర్'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రతిభ కోరారు. రాపాకలో బుధవారం 104 ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు జరిపి, మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, ఎఎన్‌ఎం ఉదయ్‌లక్ష్మి, డిఇఒ గోవింద్, ఆశ కార్యకర్తలు లక్ష్మీ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


రాపాకలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రతిభ


మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

మంచి ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం బెల్లుపడ మున్సిపల్ ప్రైమరీ స్కూల్, బ్రాహ్మణవీధిలోని ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన వీడ్కోలు సభలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. నేటి బాలలే.. రేపటి పౌరులని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు రమేష్, వార్డు కౌన్సిలరు నీలాపు లక్ష్మి, బెల్లుపడ స్కూల్ హెచ్ఎం నీలాచలం, బ్రాహ్మణవీధి స్కూల్ హెచ్ఎం విశ్వనాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

కవిటి: చింతామణి అమ్మవారి మేష సంక్రమణ మహోత్సవం సందర్భంగా చేపట్టే అన్నదానానికి జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి లోళ్ల రాజేష్ విరాళం అందించారు. 1500 మంది యాత్రికులకు సరిపడ ఆహార సామగ్రిని ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందించారు. కార్యక్రమంలో చింతామణి పూజా కమిటీ సభ్యులు, ఉషోదయ యువజన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, జన సైనికులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలోని 13వ వార్డు బెల్లుపడ కాలనీలో నివశిస్తున్న మీనా మోహనరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య మహాలక్ష్మికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను మున్సిపల్ కమిషనరు రమేష్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అందజేశారు. మిగతా రూ.90వేలు ఆమె బ్యాంకు ఖాతాలో జమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో బుడుపు త్రినాథ్, సురేష్, బట్టి బాలకృష్ణ, దేవి, తదితరులు పాల్గొన్నారు.

కంఠ వేణుకు సన్మానం

శ్రీకాకుళం అర్బన్: దళిత రైట్స్‌ఫోరం జిల్లా అద్యక్షులు కంఠ వేణుకు డాక్టరేటు రావడం ఎంతో శుభ పరిణామమని దళిత సంఘాల నాయకులు అన్నారు. నగరంలోని ఇలిసిపురంలో గల అంబేద్కర్ భవన్‌లో ఇటీవల డాక్టరేట్ అందుకున్న వేణు దంపతులను దళిత సంఘాల ఆధ్వర్యాన బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో దళిత, బహుజన సంఘాల నాయకులు బొడ్డేపల్లి నర్సింహులు, కళ్లేపల్లి రాంగోపాల్, బోనెల రమేష్, బత్తిన మోహన్, అర్జి కోటి, ఎల్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు గరిష్ట కూలి

నందిగాం: ఉపాధి హామీ కూలీలకు గరిష్ట కూలి అందేలా చూడాలని ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ హెచ్‌వి రమణమూర్తి, ఎపిఒ నాగరాజు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ రెండు పూటలు పని చేయించి, రూ.272 కూలి వచ్చేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో టెంట్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో చిన్ని జోగారావు యాదవ్, ఈసి,, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి